

**కథ**

# శిక్ష ఎవరికి?





**వీ**ధి మొదట్లో అంబాసిడర్ ఆగింది. అసలే ఇరుకు సందు. ఎవరో ఇంటిమీద మరో అంతస్తు వేయించుకుంటున్నారు. ఇసుక లోడు దింపడానికొచ్చిన లారీ బ్రేక్‌డౌన్ అయిందట.

"జాగ్రత్తగా దిగు బాబూ" అమ్మ చేయి అందించింది.

నాన్న మరోవైపు పట్టుకున్నారు. పది గడపలు దాటాక మా ఇల్లు.

నిజానికి నేను నడవలేని పరిస్థితిలో లేను. అయినా వాళ్ళ భయం వాళ్ళది.

పదిహేనం రోజుల తర్వాత మా వీధిలో మళ్ళీ అడుగుపెడుతున్నాను. ఈమధ్య కాలంలో మూడో ప్రపంచ యుద్ధమేదీ వచ్చేయలేదు. ఏ వరద ముంచెత్తలేదు. ఏ అగ్నిప్రమాదమో జరిగి ఇళ్ళన్నీ మొండివారలేదు.

అవే వాకిళ్ళు. అవే అరుగులు.

కానీ... మనుషులు?

నాలుగడుగులు వేశానో లేదో నలభై మంది పోగయ్యారు. వారి కళ్ళు వెడల్పయ్యాయి. ఆసక్తి, భయం, ఉత్సుకత..

ఓ మూడేళ్ళ పిల్ల వాళ్ళమ్మ కొంగుమాటున ముఖం దాచేసుకుంది. మరో కుర్రాడు తెరచిన నోటిని మూయడం మరచి చూస్తుండిపోయాడు. ఓ ఆంటీ బుగ్గ నొక్కుకుంటోంది. ఓ ముసలావిడ మెటికలు విరుస్తోంది. ఒకాయన తర్జనితో నన్ను చూపిస్తూ మరోకాయనతో ఏదో చెబుతున్నాడు.

వీధి మారలేదు. మనుష్యులు మారిపో

సి.వి.నరసింహదాసు

యారన్నది సుస్పష్టం.

ఎంత తలవంచుకుని నడుస్తున్నా వారి హావభావాలు నాకు తెలుస్తూనే వున్నాయి.

ఎలాగోలా ఇల్లు చేరాను. మా కోసం ఎదురుచూస్తున్న అక్క ఎదురొచ్చింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు. నేను యింటికి వచ్చేశానన్న ఆనందం.

"జరిగిన విషయాలేవీ మనసులో పెట్టుకోకు సుందర్..రెస్ట్ తీసుకో. నేను ఆఫీసుకి వెళ్ళొస్తాను" నాకు కొన్ని, అమ్మకు మరికొన్ని జాగ్రత్తలు చెప్పి నాన్న వెళ్ళిపోయారు.

అమ్మ వంటింట్లో, అక్క పెరట్లో.

నేను ఒంటరిగా..నా గదిలో.

మనసంతా అల్లకల్లోలంగా వుంది. నా జీవితంలో తుపానొచ్చింది. అది ఎంత బీభత్సం సృష్టించిందో నేను అద్దంలో చూసుకున్నప్పుడు అర్థమైంది.

"నో..నో..నో" గుండెల్లో బ్రద్దలైన అగ్ని పర్వతం గొంతు దాటింది. దిక్కులు పిక్కటిల్లే శబ్దంతో.

అరుస్తున్నాను. అరుస్తూనే వున్నాను.

○○○

"మా రోజుల్లో ఇన్ని సౌకర్యాలుండేవి కావు. ఇంటిల్లిపాదికీ రేడియో కార్యక్రమాలే దిక్కు" అమ్మ చెప్పేది.

"అవునవును. అందులోనూ పాలు చేలు, దూడ పేడ ప్రోగ్రాములే మాకు కాలక్షేపం" నాన్న వంతపాడేవారు.

"పగలంతా చదువులు, సాయంత్రం ఆటలు, చీకటి పడగానే నోట్లో ముద్ద, గూట్లో దీపం"చందాన తొందరగా నిద్రపోయి, ఉదయాన్నే నిద్రలేచే వాళ్ళం. మీరూ వున్నారు ఎందుకు? ఎంతసేపూ టీవీ ప్రోగ్రాములు, సెల్‌ఫోన్లో పోచి కబుర్లు. అర్ధరాత్రి దాటేవరకు తిండి, తిరుగుళ్ళు, బారెడు పొద్దెక్కినాక ఏ తొమ్మిదింటికో నిద్రలేవడాలు.." నేను చదువు మీద శ్రద్ధ చూపడం లేదని చెప్పడానికి నాన్న నిత్యం పాడే స్తోత్ర మిది.


ప్రతి చిన్న విషయానికీ, వాళ్ళ కాలంతో పోల్చడం నాకు నచ్చేది కాదు.

కాలం మారుతోంది. ఏం నాన్నమాత్రం మారలేదా? కిరోసిన్ లాంతరు దగ్గర చదువుకున్న నాన్న ఈరోజు కనీసం ఫ్యాన్ లేకుండా నిద్రపోగలడా?

వేరే ఏ ఎంటర్‌టైన్‌మెంటూ దొరికేది కాదు గాబట్టి, కోతి కొమ్మాటలు, బిళ్ళాకర్రలు, గోలీకాయలు, దొంగ పోలీసు ఆటలు ఆడుకునేవారు. ఆడుకోవడానికి ఆనాడు విశాలమైన గ్రౌండ్‌లు, తోటలు వుండేవి.

## ఛార్మి కోరిక!

హీరోయిన్ ఛార్మికి ఓ కోరిక వుందిట. అదేంటంటే- ఒకే సినిమాలో పది పాత్రల్ని పోషించాలని వుందిట. 'నవరాత్రి' సినిమాలో ఎఎన్నార్ తొమ్మిది వేషాలు వేసారు. రాబోయే 'దశావతారం' సినిమాలో కమల్ పది పాత్రల్ని పోషించినట్టే నేను కూడా ఒకే సినిమాలో పది పాత్రల్ని పోషించి మెప్పించాలని వుంది. ఈ మాట విన్నవాళ్లు నన్ను తేలిగ్గా కొట్టిపారేయొచ్చు. కానీ నేను అలాంటి వేషాలు వేసి మెప్పించాలని కోరుకోవడంలో తప్పేం వుంది' అంటుంది ఛార్మి. కరెక్టే. కానీ ఛార్మి కోరిక అంత తేలిగ్గా తీరుతుందా? ఆల్ ది బెస్ట్.



అవన్నీ మాకెక్కడున్నాయి. స్కూల్లో ఫ్రెండ్సే తప్ప వీధిలో మిత్రులు ఎవరున్నారు?

ఈరోజు టీవీ చూడకుండా అమ్మా, నాన్న మాత్రం ఒక్కరోజయినా వుండగలరా? నేను చూస్తేనే తప్పా?

నాకు ఊహ తెలియని రోజుల్నుండీ, టీవీ తెరమీద కదిలే ఆ రంగు రంగుల బొమ్మలంటే ఎంతో ఆసక్తిగా వుండేది. అసలు నేను అమ్మకోసం ఏడుస్తుంటే, తనే నన్ను టీవీ ముందు పడుకోబెట్టి, తన పని తను చూసుకునేది. మెల్లగా నేను టీవీకి అడిక్ట్ అయిపోయాను. నిజమే.

నాకు ప్రపంచం అర్థం కావడం ప్రారంభమయ్యాక, లోకం ఎంత అందమైందో తెలిసొచ్చింది. నా కళ్ళ ముందే ఎన్నెన్ని మార్పులు. ఎన్ని కొత్త కొత్త ఛానెల్స్ వచ్చాయో. పిల్లలకి, పెద్దలకి ముసలి వాళ్ళకి, పడుచు వాళ్ళకి, రక్తి, ముక్తి, భక్తి, శక్తి, యుక్తి కుయుక్తి అన్నీ ఒకేచోట, ఒకే పెట్టెలో.

మరీ చిన్నప్పుడు కార్టూన్ ఛానెల్స్ వచ్చేవి. స్కూలుకొచ్చాక ఇతర ప్రోగ్రాంలు కూడా నచ్చడం ప్రారంభమైంది.

ఎనిమిదో తరగతిలో వుండగా మూతి మీదకి నూనూగు మీసాలొచ్చాయి. నాకు ప్రపంచాన్ని జయించిన ఆనందం. నేనూ పెద్దవాడినవుతున్నాను. నేనేం చెప్పినా పిల్లమాటగా కొట్టిపారెయడం యికపై ఈ పెద్దలకి కుదరదు.

బాలమిత్ర, చందమామలకన్నా ఇతర వీక్లీలు నచ్చుతున్నాయి. కొన్ని సినిమాల్లోని డైలాగులు స్పష్టంగా అర్థం అవుతున్నాయి.

మా క్లాస్‌మేట్స్‌లో అమ్మాయిలు మరింత అందంగా కనిపించడం ప్రారంభమైంది.

తెరపై కదిలే బొమ్మల్లో నన్ను నేను ఐడెంటిఫై చేసుకుంటున్నాను.

"నిజజీవితంలో జరిగేవే మేము చూపిస్తున్నాం" అంటున్నారు నిర్మాతలు, దర్శకులు.

నిజమే. అవన్నీ ఎక్కడో, ఎప్పుడో జరుగుతూ వుండొచ్చు.

బుగ్గమీద మొదటిసారి మొటిమ వచ్చినప్పుడు నాన్నతో పోరాడి క్రీమ్ కొనిపించుకున్నాను. అది నా విజయం. పోరాటం అని ఎందుకన్నానంటే, నేను ఏ కొత్త విషయం అడిగినా, అమ్మా నాన్నల నుండి వచ్చే మొట్టమొదటి సమాధానం "నో..ఎందుకు?"

నాది మొండితనం అని విసుక్కుంటూనే, రాజీపడక తప్పడం లేదు వారికి.

పదో తరగతి పాసయి, ఇంటర్లో చేరేసరికి నాకు నేను ముద్దొచ్చేలా తయారయ్యాను. నా అందానికి నేనే గర్వపడేవాడిని. మా క్లాస్‌లో నేనే 'హీమాన్'ని.

నాకొచ్చే కలలు కూడా మారిపోయాయి.

కుందేళ్ళు, తాబేళ్ళు కాదు. రంగు రంగుల సీతాకోక చిలుకలు కనిపిస్తున్నాయి. వాళ్ళు నన్ను సరికొత్త లోకాల్లోకి తీసుకుపోతున్నారు. ఆటలు, పాటలు, కేరింతలు, కవ్వింతలు కౌగిలింతలు.

ఎన్నాళ్ళీ కలలు నిజమయ్యేదెప్పుడు? నాకో అమ్మాయి కావాలి. అలాగని నేనామెకు అన్యాయం చేయను. తప్పక పెళ్ళి కూడా చేసుకుంటాను.

ఎక్కడో వెతకడం ఎందుకు? మా కాలేజ్‌లోనే బోలెడు బ్యూటీలున్నారు. వారిలో అందగత్తె 'శైలజ'.

ఆమె మా వెనుక వీధి అమ్మాయే. ఇద్దరిదీ ఒకే బస్టాప్. ఒకటి రెండుసార్లు నన్ను చూసి నవ్వినట్టు కూడా గుర్తు. ఎందుకు నవ్విందో. పలకరింపుగానా? లేక తనకి నా మీద వేరే అభిప్రాయమేదైనా వుందా? ఉందేమో. లేకపోతే ఎందుకు స్మైలిస్తుంది.

శైలజ గుర్తుకొచ్చినప్పుడల్లా నరాలు జివ్వున లాగేస్తున్నాయి. కళ్ళుమూసినా తెరచినా ఆమె రూపమే. అపురూపమైన ఆ అందం నా స్వంతం కావాలి. అవుతుంది. నాకేం తక్కువ. ఆమె నా ప్రేమను తప్పక అంగీకరిస్తుంది.

ఇక పెద్దల విషయమా..ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా నేనామెను పెళ్ళి చేసుకుంటాను. నేను చూసిన ఓ సినిమాలో ప్రేమికులు పారిపోయి, అడవిలో యిల్లు కట్టుకుని హాయిగా వుంటారు. మరో సిన్మాలో పెద్దలు పొమ్మంటే, పాలమ్ముకుంటూ సుఖంగా వుంటారు.

యింకో సిన్మాలో పదోతరగతిలోనే కాలు జారి, పిల్లాడ్ని కని ఎంచక్కా బ్రతికేస్తూ పెద్దవాళ్ళ కళ్ళు తెరిపిస్తారు.

నేను, శైలజ కలిస్తే అదో కొత్త బంగారు లోకం. ఏ సమస్యలు దరిచేరని మరో స్వర్గం.

నా క్లాస్‌మేట్స్‌లో ఒకరిద్దరు నాకు సపోర్ట్ నిచ్చారు. నా ఆలోచనని మెచ్చుకున్నారు.

నాలో మరింత ధైర్యం.

బస్టాఫ్‌లో కలిసినప్పుడు ఆమెతో మాట్లాడాల్సిన పని వుందని, లంచవర్లో కాలేజ్ వెనుక గార్డెన్ దగ్గర కలవమని చెప్పాను శైలజకి.

ఆమె కళ్ళల్లో ఆశ్చర్యం. వింత మెరుపు.

ఆమె నా ఆహ్వానాన్ని మన్నించింది. సగం గెలిచేశాను. నా ప్రేమను కూడా అంగీకరించేస్తే, గెలుపు పరిపూర్ణమవుతుంది.

మనసు పరచి, మోకరిల్లాను.

అప్పుడు తగిలింది చెంపదెబ్బ. మాటల తూటా దెబ్బ.

నాది ప్రేమ కాదు ఆకర్షణట. నాది అడాలసెంట్ ఏజ్‌ట. ఇలాంటి వెర్రివేషాలు కట్టిపెట్టి బుద్ధిగా చదువుకుని పైకి రమ్మని సలహా నిచ్చింది.

నా జీవితంలో మొదటి పరాజయం..పరాభవం.

నన్నే కాదంటుందా..నాకే ఎదురు చెబుతుందా? కుమిలిపోయాను. మరిగిపోయాను. రగిలిపోయాను.

శైలజని పొందాలి. ఎలా? ఆమధ్య ఒకడు టవర్‌పై కెక్కి దూకుతానన్నాడు. మరొకడు నరం కోసుకుని రక్తంతో లెటర్ రాశాడు. ఇంకొకడు విషం తాగుతానని బెదిరించాడు. ఆపై వారి కథలు ఏమయ్యాయో నాకనవసరం.

నా కథ సుఖాంతం కావాలి. అలా జరగకపోతే, నాకు కాని శైలజ మరెవ్వరికీ దక్కకూడదు.

ఓ నిర్ణయానికొచ్చాను. నాలో ఏదో తెగింపు. మిత్రుల ప్రోత్సాహం.

శైలజ క్లాస్‌లో వుంది. లెక్చరర్ యింకా రాలేదు. గోల గోలగా వుంది.

ఆమె ముందు నేను..ముందు రోజు రాత్రి ఏడ్చి ఏడ్చి ఉబ్బిపోయిన ఎర్రటి కళ్ళతో.

మరోసారి ప్రేమను నివేదించాను. కరుణించమన్నాను. అర్థించాను. అంగీకరించమంటూ చేతులు పట్టుకోబోయాను.

గొంగళిపురుగును ముట్టుకున్నంత అలెర్జీ చూపిస్తూ, ఆమె నా చేతుల్ని విసిరికొట్టింది. నా అహం మీద కొట్టింది.

కృద్ధుడి నయ్యాను. రుద్రుడినయ్యాను. ఆఖరి అస్త్రంగా పైకి తీశాను. వెంట తెచ్చుకున్న ఆసిడ్ సీసా...



మూత తెరిచాను.

ఆ తర్వాత...

క్షణంలో జరిగిపోయిందది. నన్ను నలుగురు ఒడిసి పట్టుకున్నారు. సీసా చేజారి గాల్లోకి ఎగిరి, క్రిందకి జారింది.

సరిగ్గా, నా ముఖం మీద పెటిల్లున పగిలింది.

నా చుట్టూ హాహాకారాలు..నావి ఆర్తనాదాలు.

ముఖాన్ని చేతులతో కప్పుకుని కూడలబడిపోయాను.

○○○

ముఖం పూర్తిగా కాలిపోయింది. అదృష్టవశాత్తు చూపుకేం కాలేదు. కనురెప్పలు కరిగిపోయాయి. చర్మం ముడుచుకుపోయి, హాలీవుడ్ హారర్ సినిమా కేరక్టర్‌లా మిగిలిపోయాను.

ప్రేమతో స్వర్గసుఖాలను కలగన్న నేను, ప్రత్యక్షంగా నరకాన్ని చవిచూశాను.

నా ముఖం నాకే అసహ్యంగా వుంది.

పదిహేనురోజులు హాస్పిటల్‌లో వుండి యింటికి చేరిన నేను, అద్దంలో నా అనాకార అందాన్ని మొదటిసారి చూసుకున్నాను.

నాకీ శిక్ష పడాల్సిందే. ఒప్పుకుంటాను.

కానీ..

కాసుల పేరాశతో, పసిమనసుల్ని దుష్ప్రభావితం చేస్తాయని తెలిసి కూడా టీనేజ్ లవ్ స్టోరీలని, రంగుల చిత్రాలుగా చుట్టి దేశం మీదకి వదులుతున్న మహమ్మారుల్ని, పదే పదే వాటిని ప్రసారం చేసి రేటింగ్‌ల పబ్బం గడుపుకుంటున్న చిన్ని తెర చీడపురుగుల్ని ఎవరు శిక్షిస్తారు?

ఏ నరకలోకపు ద్వారాలు వారికోసం ఎప్పుడు తెరచుకుంటాయి?

○

## దటీజ్ జూహీ!

ఈమధ్య కాలంలో సినిమాలకంటే 'కుర్‌కురే' యాడ్స్‌లో నటించడం ద్వారానే ఎక్కువ పాపులారిటీ సంపాదించుకున్న జూహీ చావ్లా- తన ఏజ్, పర్సనాలిటీకి తగిన వేషాలు ఏవైనా వేస్తానంటోంది. 'నా వయసు ఎంతో ప్రేక్షకులకి తెలుసు. కాబట్టి అక్క, వదిన, తల్లి లాంటి పాత్రల్ని నేను పోషిస్తే తప్పకుండా ఆదరిస్తారు. అంతే గానీ ఇంకా కాలేజీ అమ్మాయి పాత్రలు మాత్రమే చేస్తానంటే ఎవరూ ఒప్పుకోరు' అని తన ప్రస్తుత స్థితిని చక్కగా అంగీకరిస్తోంది జూహీ. కొంత మంది టింగణా హీరోయిన్లు జూహీ మాటల్ని వింటే కొంతమందిలోనైనా మార్పు వస్తుందేమో!